వరదనీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


వైభవ్‌నగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరద నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రజలకు హామీనిచ్చారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ వైభవ్‌నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని డ్రైనేజీని పరిశీలించారు. సమస్య పరిష్కారానికి రూ.35లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మకుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

బతుకమ్మ కుంట సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలి

● హైడ్రా కమిషనర్ రంగనాథ్

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండగ సమయం దగ్గర పడుతున్నందున బతుకమ్మకుంట సుందరీకరణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బతుకమ్మకుంట సుందరీకరణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. చెరువు చుట్టూ పాత్‌వే ఏర్పాటు చేయాలని, నీడనిచ్చే చెట్లను పెంచాలని సూచించారు. వర్షం పడినప్పుడు కాలనీల్లోని నీరు బతుకమ్మకుంటకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కేంద్ర బృందాలు ఈ చెరువును సందర్శించి కితాబిచ్చారని రంగనాథ్ గుర్తు చేశారు. చెరువు మధ్యలో బతుకమ్మను ప్రతిబింబించేలా ప్రతిమ ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో హైడ్రా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఆలయ ఈఓకు విరాళాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ పావని

భక్తితోనే మానసిక ప్రశాంతత

● కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయ ఆవరణలో షెడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తన వంతు సాయంగా రూ.51వేల విరాళాన్ని బుధవారం ఆలయం ఈఓ లక్ష్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధి, పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, నర్సింగ్‌రావు, ప్రకాష్‌యాదవ్, జ్ఞానేశ్వర్, ఆలయ చైర్మన్ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు సురేందర్, భాను, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు స్కాలర్‌షిప్స్ ప్రదానం

చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిజాయితీ, అంకితాభావం ఉన్న అధికారులు దేశానికి చాలా అవసరమని గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఇటీవల గ్రాన్యూల్స్ విద్యా స్కాలర్‌షిప్ టెస్ట్ 2025 నిర్వహించి 20 మందిని ఎంపిక చేశారు. వారికి బుధవారం అశోక్‌నగర్‌లోని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీలో స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేశారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో విద్యాస్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్టు ఉమా తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ మల్లవరపు బాలలత, సీనియర్ జర్నలిస్ట్ జయప్రసాద్, గ్రాన్యూల్స్ ప్రతినిధి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఐవీఎఫ్ అండ: ఉప్పల

ముషీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) అండగా నిలుస్తోందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన డా.బాలు, ప్రసాద్‌వర్మ, వెంకటరమణ, శివకుమార్‌లు జాతీయ రక్తవీర్ పురస్కారాన్ని అందుకున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకం చేసేందుకు ఐవీఎఫ్ అంకితాభావంతో పనిచేస్తున్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవో క్యాన్సర్ వైద్యులు ఆజాద్ చంద్రశేఖర్, విశాల్ టోకా తదితరులు

బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవో క్యాన్సర్ సెంటర్ వైద్యులు దిగ్విజయంగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్ నిపుణుడు డా.ఆజాద్ చంద్రశేఖర్, సీనియర్ కన్సల్టెంట్ డా.విశాల్ టోకాలు వెల్లడించారు. తూకారాంగేట్ మౌలాలి ప్రాంతానికి చెందిన 58 సంవత్సరాల వయసు గల ఓ వ్యక్తి ఆరు నెలలుగా శోషరస గ్రంథి వాపు, జ్వరం, రాత్రిపూట చమటలు రావడం, బరువు తగ్గడం, ఆలసట, ఛాతీ నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా పరీక్షించిన డాక్టర్లు హైగ్రేడ్ నాన్ హడ్కిన్ లింఫోమా క్యాన్సర్ అని చెప్పారు. కుటుంబ సభ్యులు ప్రముఖ ఆస్పత్రులలో ఆరు పర్యాయాలు కీమోథెరపీ చేయించారు. అయినా ఎలాంటి మార్పు లేకపోవడంతో వారు దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవో క్యాన్సర్ వైద్యులను సంప్రదించారు. వ్యక్తిని అడ్మిట్ చేసుకున్న వైద్యులు ఆటోలోగస్ విధానం ద్వారా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఆ రోగి పూర్తి ఆరోగ్యంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా రోగి కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రాకేష్, కిషోర్ చంద్ర, శంకర్‌గౌడ్, రవికుమార్‌రెడ్డి, ఉల్లాస్, గౌతమి, సమంత్, రవీంద్రనాథ్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీ స్వీపర్లకు చీరలు పంపిణీ చేస్తున్న చంద్రకళశంకర్


రాజీవ్‌గాంధీ జయంతి సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హనుమంతరావు


మహిళలకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న సునీతారావు

సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ


సుందరయ్యపార్కు వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ నాయకుడు శ్యామ్‌యాదవ్ తదితరులు


రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రరీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పద్మజ


రాజీవ్‌గాంధీ ఖేల్ ఉత్సవ రన్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు బొగ్గారపు వరుణ్ తదితరులు

ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విప్లవానికి ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆయా ప్రాంతాల్లో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్‌లో టీపీసీసీ మహిళా నాయకురాలు చంద్రకళ శంకర్ జీహెచ్‌ఎంసీ స్వీపర్లకు చీరలను పంపిణీ చేశారు. అంబర్‌పేటలో పేద మహిళలకు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతారావు, హైదరాబాద్ సెంట్రల్ లైబ్రరీ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, లైబ్రరీ కార్యదర్శి పద్మజ, కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌యాదవ్, పర్వతాలు, ఉషశ్రీ, వనజ, హేమలత, సుబ్రహ్మణ్య ప్రసాద్, బొల్లు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి పకడ్బందీ ఏర్పాట్లు

● ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ సుంకరి శ్రీనివాస్

బర్కత్‌పుర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ సుంకరి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరగడానికి తూర్పు మండలం, సెంట్రల్ జోన్ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల విద్యుత్ ప్రమాదాలు జరిగి కొంత మంది ప్రాణాలు కోల్పోయారని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని డీసీపీ కోరారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రోడ్ల వెంట అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తామని, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల గుంతలను పూడ్చి వేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీలు శ్రీనివాస్, మోహన్‌రావు, ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ సీఐలు సుధాకర్, రాంబాబు, శ్రీనివాస్, సైదురెడ్డి, రవీందర్, వీరేశం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగించాలి: ఆకుల శ్రీనివాస్


కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఆకుల శ్రీనివాస్, నర్సయ్య తదితరులు

కవాడిగూడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అధికారుల అనాలోచిత నిర్ణయాలతో జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగం డ్రైవర్లను ఇతర విభాగాలకు బదిలీ చేయడంతో నగరంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలుతెప్పలుగా పేరుకుపోతుందని జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ జేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్, తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సయ్యలు ఆరోపించారు. రాంకీ సంస్థకు చెందిన డ్రైవర్ల సమ్మెతో చెత్త తరలింపు సమస్య మరింత జఠిలమైందని వారు అన్నారు. కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీల్లో చెత్త తరలించకపోవడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఈ సమస్యపై నగర కమిషనర్, మేయర్ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు బాలరాజు, జహీర్, నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, కృష్ణ, వెంకటేశ్, శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని రాజ్ ఫ్లేవర్స్ ఇండస్ట్రీ సీజ్



రాజ్ ఫ్లేవర్స్ ఇండస్ట్రీని సీజ్ చేసిన జీహెచ్ఎంసీ, విజిలెన్స్ అధికారులు

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్రత వాతావరణంలో బేకరీ, ఫుడ్‌కు సంబంధించిన ఫ్లేవర్స్ తయారు చేస్తున్న రాజ్ ఫ్లేవర్స్ ఇండస్ట్రీని జీహెచ్ఎంసీ, విజిలెన్స్, ముషీరాబాద్ సర్కిల్ అధికారులు సీజ్ చేశారు. నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని ఓ భవనం మూడవ అంతస్తులో రాజ్ ఫ్లేవర్స్ పరిశ్రమ కొనసాగుతుంది. ఈ పరిశ్రమ నుంచి వచ్చే వివిధ రసాయనాల దుర్వాసనతో తాము అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు శరత్‌కుమార్ జీహెచ్ఎంసీ కమిషనర్, పొల్యూషన్ విభాగం, లా అండ్ ఆర్డర్ పోలీసులు, ముషీరాబాద్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు రాజ్ ఫ్లేవర్స్ పరిశ్రమ నిర్వాహకులైన రాహుల్ తపాడియాకు జీహెచ్ఎంసీ అధికారులు మూడు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ పరిశ్రమ నిర్వాహకులు ఎలాంటి వివరణ ఇవ్వకపోవడంతో బుధవారం మధ్యాహ్నం జీహెచ్ఎంసీ విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాస్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి, ఏసీపీ దేవేందర్, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సాహితీ, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యలు ఇండస్ట్రీపై దాడి చేసి అందులో తయారవుతున్న ఫుడ్, బేకరీ ఫ్లేవర్లను పరిశీలించారు. పరిశ్రమకు సంబంధించిన అన్ని రకాలు పత్రాలు చూపించకపోగా.. అధికారులకు తనిఖీ చేయకుండా అడ్డుకున్నట్టు సమాచారం. దీంతో అధికారులు వారికి నోటీసులు ఇచ్చి రాజ్ ఫ్లేవర్ పరిశ్రమను సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాస్, డీఎంసీ రామానుజులరెడ్డిలు మాట్లాడుతూ.. ఈ పరిశ్రమకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి లేదన్నారు. అపరిశుభ్రత వాతావరణంలో ఫ్లేవర్స్ తయారు చేస్తున్నారని, ఎలాంటి పన్నులు చెల్లించడం లేదని అన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ పరిశ్రమను సీజ్ చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

బెంగళూరు నుంచి నగరానికి ఎండీఎంఏ సరఫరా

● పాత నేరస్థుడితో పాటు సరఫరాదారుడు అరెస్ట్

● వివరాలు వెల్లడించిన దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌న్యూ సీఐ డానియెల్


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌న్యూ సీఐ డానియెల్

హైదరాబాద్ సిటీ/ కవాడిగూడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ఎండీఎంఏ తెప్పించి నగరంలో విక్రయిస్తున్న పాత నేరస్థుడితో పాటు అతడికి సరఫరా చేస్తున్న బెంగళూరుకు చెందిన విద్యార్థిని దోమలగూడ, హెచ్‌న్యూ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.7.30 లక్షల విలువైన 12.57 గ్రాముల ఎండీఎంఏ, 305 గ్రాముల గంజాయి, ఒక కారు, 3 మొబైల్స్, రూ.1080 స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌న్యూ సీఐ డానియేల్ వివరాలు వెల్లడించారు. మచిలీపట్నంకు చెందిన రాఘవేంద్రరావు డిప్లొమా వరకు చదువుకున్నాడు. స్నేహితుడితో కలిసి మెడికల్ ఏజెన్సీ పెట్టి నష్టపోయాడు. అప్పులు తీర్చుకునేందుకు గంజాయి విక్రయాలు ప్రారంభించాడు. సీలేరు నుంచి గంజాయి తెచ్చి నూజివీడు ప్రాంతంలో విక్రయిస్తున్నాడు. గంజాయి దందా చేస్తున్న అతడిని పోలీసులు పలుమార్లు అరెస్ట్ చేశారు. ఏపీలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో అతడిపై 5 కేసులు నమోదయ్యాయి. విజయవాడ ఆటోనగర్‌లో ఉంటున్న రాఘవేంద్రరావు జైలు నుంచి విడుదలై గంజాయితో పాటు, నగరంలో ఎండీఎంఏ విక్రయాలు ప్రారంభించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బెంగళూరుకు చెందిన నిఖిల్ నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి, నగరంలో కస్టమర్లకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. బెంగళూరుకు చెందిన నిఖిల్ ఏబిలో బీసీఏ చదువుతున్నాడు. స్నేహితులతో గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డ అతడు, నైజీరియన్ల పరిచయంతో పెడ్లర్‌గా మారాడు. నైజీరియన్‌ల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, పలువురికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన రాఘవేంద్రకు కూడా ఎండీఎంఏ సరఫరా చేస్తున్నాడు. తన ఆచూకీ ఇతరులకు తెలియకుండా ఉండేందుకు ఎండీఎంఏ, గంజాయిని ఓ ప్రదేశంలో ఉంచి, ఆన్‌లైన్ చెల్లింపులు అయిన తర్వాత ఈ వివరాలు సరఫరాదారులకు అందించేవాడు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న హెచ్‌న్యూ సిబ్బంది, దోమలగూడ పోలీసులతో కలిసి నిఘా పెట్టారు. ఎండీఎంఏ డెలివరీ చేసేందుకు వచ్చిన నిఖిల్, తీసుకునేందుకు వచ్చిన రాఘవేంద్రలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో దోమలగూడ ఎస్ఐ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖకు నూతన ఏసీ నియామకం

చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలశాఖ హెడ్‌క్వార్టర్స్ అసిస్టెంట్ కంట్రోలర్(ఏసీ)గా ఉమారాణి బుధవారం నియమితులయ్యారు. డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆమెను పదోన్నతిపై ఏసీగా నియమించారు. ఇప్పటి వరకు ఏసీగా ఉన్న రాజేశ్వర్ వరంగల్‌కు బదిలీ అయ్యారు.

సయ్యద్ ఖాదర్‌కు డాక్టరేట్


అబ్దుల్ ఖాదర్

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): న్యాయ సలహాదారులుగా, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా సేవలందిస్తున్న సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌కు లెజండరీ పీస్ అవార్డు కౌన్సిల్ సంస్థ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌కు నిర్వాహకులు డాక్టరేట్‌ను ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఖాదర్ మాట్లాడుతూ, సమాజానికి మరింత సేవ చేయడానికి కృషి చేస్తానన్నారు. లైఫ్ సైన్స్, ఫిలాసఫీ చదివిన తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని, ఇది తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. డాక్టరేట్ సాధించిన ఖాదర్‌కు ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు


కిళాంబి అలివేలుతో కుటుంబ సభ్యులు

రాంనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్‌కు చెందిన కిళాంబి అలివేలు 105వ జన్మదిన వేడుకలను బుధవారం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. 105వ యేట జన్మదిన వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని కిళాంబి అలివేలు తెలిపారు. ఇప్పటికీ ఆమే చేతికర్ర సాయంతో తన పని తానే చేసుకుంటుంది. ప్రస్తుతం ఆమెకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. నిత్యం ఆమెను అనుక్షణం పర్యవేక్షిస్తూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


వడ్డెర సంఘం ఆత్మగౌరవ జెండాను బుధవారం ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంతయ్య.
-చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

చెట్ల కొమ్మల తొలగింపు

చిక్కడపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్ల అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను జీహెచ్ఎంసీ హార్టికల్చర్ విభాగం సిబ్బంది బుధవారం తొలగించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు చిక్కడపల్లి, అశోక్‌నగర్, వివేక్‌నగర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించినట్లు జీహెచ్ఎంసీ సిబ్బంది తెలిపారు.

కిరణ్ గౌడ్ మృతదేహం లభ్యం

బర్కత్‌పుర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భార్య చనిపోయిన బాధలో మూసీలో దూకి ఆత్మహత్య చేసుకున్న డేటా ఆపరేటర్ కిరణ్‌గౌడ్(47) మృతదేహం బుధవారం లభ్యమైంది. కాచిగూడ అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్‌కు చెందిన బాలరాజుగౌడ్ కుమారుడు కిరణ్‌గౌడ్ ఈ నెల 18న సోమవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి మూసీలో దూకిన విషయం తెలిసిందే. బుధవారం రోజున కిరణ్‌గౌడ్ మృతదేహం బాచారం గ్రామ సమీపంలోని మూసీనది ఒడ్డున మురికి చెత్త వద్ద లభ్యమైనట్టు ఆయన తెలిపారు. మూడు రోజులుగా కాచిగూడ పోలీసులు కిరణ్‌గౌడ్ మృతదేహం కోసం గాలించారని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కిరణ్‌గౌడ్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందించారు.

ఇంటి అక్రమ రిజిస్ట్రేషన్.. వ్యక్తి అరెస్ట్

కవాడిగూడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి ఇంటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇవ్వకుండా మూడు సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న నూనావత్ యుగంధర్‌ను దోమలగూడ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడకు చెందిన పవన్, అశోక్‌నగర్‌కు చెందిన వాంగ్ హౌసింగ్ అనే వ్యక్తులకు ఖమ్మం జిల్లా దేవరాజ్ తండాకు చెందిన సునావత్ యుగంధర్ ఇంటిపై రూ.60 నుంచి రూ.80 లక్షలు చెల్లిస్తామని ఆశ చూపి అతని పేరుపై వారి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇంటికి రూ.50 నుంచి రూ.80 లక్షలు చెల్లించి ఆ ఇంటికి సంబంధించిన ఓరిజనల్ డాక్యుమెంట్లను బ్యాంకులో పెట్టి దాదాపు 3 కోట్ల రూపాయల రుణం తీసుకున్నాడు. ఇంటి యజమానులకు మిగతా డబ్బులు చెల్లించకుండా మూడు సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న పవన్‌పై బాధితులు ఫిర్యాదు చేశారు. దోమలగూడ పోలీసులు అతనిపై ఛీటింగ్ కేసు నమోదు చేసి కారు, మూడు ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

ముషీరాబాద్‌లో 'డిజిటల్' అయోధ్య



ముషీరాబాద్ చౌరస్తా సమీపంలో శక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపం వద్ద 50 అడుగుల ఎత్తులో అయోధ్య రామమందిరం, శ్రీరాముడు, హనుమంతుని ప్రతిమలను డిజిటల్ లైట్స్‌తో ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన ఈ భారీ డిజిటల్ లైటింగ్ బోర్డు అందరిని ఆకట్టుకుంటున్నది.

- ముషీరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి)